
ఉప్పార్లపల్లిలో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు


బాలేపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

మురుగు.. వీధుల్లో పరుగు!

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త
- దోమల బెడదతో రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పేరుకే స్వచ్ఛత కార్యక్రమాలు

నల్లచెరువు: మండలం వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. పక్కా డ్రైనేజీలు లేక గ్రామాల్లో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. దీంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలవ్యాప్తంగా ఉన్న 13 పంచాయతీలున్నాయి. ఇందులో బాలేపల్లితండా, పోలేపల్లి, పోలేవాండ్లపల్లి, కే.పూలకుంట, దామవాండ్లపల్లి, ఓరువాయి, ఉప్పార్లపల్లి తదితర గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చాలా గ్రామాల్లో అధికారులు పారిశుధ్య పనులను గాలికి వదిలేశారు. పారిశుధ్య కార్మికులు ఉన్న గ్రామాల్లో సైతం చెత్తాచెదారం తొలగించడం లేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతోంది. ఇక ఇళ్లలోని వాడకం నీరు, మురుగునీరుతో కలిసి రోడ్ల మీద ప్రవహించడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మురుగునీటికి దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. దోమల బాధ భరించలేక సాయంత్రం కాగానే ప్రజలు ఇళ్లకు తలుపులు వేసుకుంటున్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం...

అధికారులు, సిబ్బంది విధులకు హాజరయ్యా మా..వెళ్లామా అనే పరిస్థితి తప్ప విధి నిర్వహణలో జవాబుదారి తనం కొరవడింది. పారిశుధ్యంపై నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. మండలస్థాయి అధికారులు సైతం గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించడం లేదు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఒక్కరోజు ఆర్భాటంగా నిర్వహించడం ఆ తర్వాత కార్యక్రమ ఉద్దేశాన్ని గాలికి వదిలేయండం పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్రాలకు చెత్త తరలించకపోవడంతో అవి కాస్త నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కంటిపై కునుకు ఉండదు



ఉప్పార్లపల్లిలో డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో పంచాయతీ వాటర్ ట్యాంకు నించి మంచినీటితో పాటూ మురుగునీరు కలసిపోయి రోడ్లపై పారుతోంది. దీంతో వీధుల్లో దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు బెడద ఎక్కువైంది. సాయంత్రం అయితే చాలు దోమకాటుకు భయపడి బయట కూర్చోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

– పి. మహేంద్ర, ఉప్పార్లపల్లి

ఎక్కడి చెత్త అక్కడే



గ్రామంలో చెత్త పేరుకుపోయింది. పారిశుధ్య కార్మికులు చెత్తను తీసుకెళ్లి వీధి చివరిన పడేయడంతో ఫలితం ఉండడం లేదు. మరోవైపు గ్రామాల్లోని చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో మందుబాబులు కేంద్రాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలి.

– తులసమ్మ, బాలేపల్లి తండా

ఉద్యోగులను నిరాశ పరిచిన బడ్జెట్

ఎన్పీకుంట: కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశ పరచిందని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నేత గంగాధర్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు ఆయన సంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐఆర్ ప్రకటించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన ఐఆర్, పీఆర్‌సీ ఇస్తామని ఎన్నికల్లో చెప్పిందని, బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకుండా మోసం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్‌సీని రద్దు చేసిందని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఏడాదికి కేవలం ఒక ఇంక్రిమెంట్‌తోనే వేతనం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

పీఆర్సీ, బకాయిల అమలుకు కేటాయింపులేవీ?

కదిరి అర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో పీఆర్సీ, ఐఆర్ అమలుకు కేటాయింపులపై స్పష్టత లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్, జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీలపైనా బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన లేదన్నారు. అలాగే పాఠశాల విద్యకు గతేడాది 15 శాతం నిధులు కేటాయించగా ప్రస్తుతం బడ్జెట్‌లో 9.86 శాతం మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఉద్యమ బాట పట్టక తప్పదన్నారు.

వేతన సవరణకు నిధులు నిల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి ఎలాంటి నిధులు కేటాయించలేదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌లాజమ్, మారుతీ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలిచ్చిన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోవడం లేదని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగాన్ని అరికట్టండి

- పదేళ్ల నాటి ఉపాధి హామీ బిల్లులు పెట్టడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మండిపాటు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ధర్మవరం: నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కోరారు. మున్సిపాలిటీకి సంబంధం లేకుండా చేసిన పనులు, అదీ పదేళ్ల క్రితం చేసిన వాటికి ఇప్పుడు బిల్లులు ఎలా మంజూరు చేస్తారని అధికారులను నిలదీశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన, కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం వాడీవేడీగా జరిగింది. తొలుత అధికారులు అజెండాలోని అంశాలను చదువుతుండగా 37వ వార్డు కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ 2015–16లో చేసిన ఉపాధి పనులకు సంబంధించి రూ.15 లక్షల బిల్లులను ఇప్పుడు మంజూరు చేస్తూ అజెండాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. స్పందించిన చైర్‌పర్సన్ బిల్లులు మంజూరు చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల నుంచి సీసీరోడ్లు, డ్రైన్‌లు వేసిన కాంట్రాక్టర్లకు నేటికీ బిల్లులు మంజూరు కాలేదని, ఇలాగైతే కాంట్రాక్టర్లు పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

వీధిలైట్ల కొరత..

కౌన్సిలర్లు మేడాపురం వెంకటేశ్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, నీలూరి వెంకటరాముడు మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్ల కొరత తీవ్రంగా ఉందని, ఎన్నిసార్లు కౌన్సిల్ దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారిందన్నారు. పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యను పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. శివానగర్‌లో రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబుళమ్మ మాట్లాడుతూ పట్టణంలోని దేవీ నర్సింగ్ హోం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా దుకాణాలను నిర్మించి అన్యాక్రాంతం చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షంషాద్‌బేగం, మెప్మా టీపీఓ విజయభాస్కర్‌రాయల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


విజేతలతో డీఈఓ క్రిష్టప్ప, పాఠశాలల సిబ్బంది



కాకతీయ పాఠశాలలో నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి: కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ క్రిష్టప్ప అధ్యక్షత వహించారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్, ఏడీ లాజర్, ఎంఈఓలు జయచంద్ర, జాన్, హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో సర్ సీవీ రామన్ సాధించిన విజయాలను వివరించారు. స్థానిక సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి దోహదపడే ఆవిష్కరణలు చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో జిల్లాలోని 11 పాఠశాలల నుంచి 84 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

బత్తలపల్లి: మానవాళి అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జయంతి, శ్రీజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ ధర్మతేజ, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల్లో సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభించి మాట్లాడారు. 1928, ఫిబ్రవరి 28న సర్ సీవీ.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొడాన్ని పురస్కరించుకుని ఏటా జాతీయ సైన్సు దినోత్సవం జరుపుకున్నట్లు వివరించారు. దైనందిన జీవితంలో సైన్స్ ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు సర్ సి.వి.రామన్ స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పద్మావతమ్మ, స్వరాజ్య లక్ష్మీ, ఉపాధ్యాయులు, శ్రీ జ్యోతి హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రోబోటిక్ ఫైర్ ఫైటర్, చంద్రయాన్, వాటర్ ప్యూరిఫైయర్, హార్ట్ పంపింగ్, పవన విద్యుత్, సూర్యగ్రహణం తదితర నమూనాలు ప్రదర్శించారు. ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ఫౌండర్ శెట్టిపి రామిరెడ్డి, డైరెక్టర్లు సూర్య ప్రకాష్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ గోపాల్‌నాయక్, వైద్యుడు సుబ్బారావు, వన్ టౌన్ ఎస్‌ఐ కేతన్న తిలకించడంతోపాటు విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే సూర్య స్కూల్‌లో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, వైద్యులు విక్రాంత్, పాఠశాల హెచ్‌ఎం నరేంద్ర, జేవీవీ సభ్యుడు లోకేష్ పాల్గొన్నారు.

గడువులోపు ఫారంపాండ్ పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఏపీడీ రమేష్‌బాబు

తనకల్లు: నిర్దేశిత గడువులోగా ఫారంపాండ్ పనులను పూర్తి చేయాలని ఉపాధి హామీ ఏపీడీ రమేష్ బాబు సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలానికి 170 ఫారంపాండ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు కేవలం 25 పనులు మాత్రమే ప్రారంభించారన్నారు. మిగిలిన పనులను మార్చి 5లోపు ప్రారంభించి, మార్చి 31కి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. హార్టికల్చర్‌లో భాగంగా ఏప్రిల్ 1న 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తమ గ్రామాల్లో ఉపాధి హామీపై అవగాహన కల్పించి జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ రెడ్డెప్ప, ఏపీఓ మరియమ్మ, ఈసీ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి వద్ద ఉన్న అస్మిత పేపర్ మిల్లు సమీపంలో జి.చంద్రశేఖర్ (43) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించాడు. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన చంద్రశేఖర్ ఓ సప్లయర్స్ దుకాణంలో పని చేసేవాడు. మూడు రోజుల క్రితం పనిపై వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపి వచ్చాడు. శుక్రవారం ఉదయం పేపర్ మిల్లు వద్ద ఓ మృతదేహం పడి ఉన్నట్లుగా తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి ముఖంపై గాయాలు ఉండడంతో అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి రమణమ్మ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శిల్పారామం అభివృద్ధికి చర్యలు

పుట్టపర్తి టౌన్: పట్టణ సమీపంలోని శిల్పారామం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సీఈఓ స్వామినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శిల్పారామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

యాజమాన్య చర్యలతో అధిక దిగుబడి

నల్లమాడ: సరైన యాజమాన్య చర్యలు చేపడితే మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు అధికారులు సూచించారు. మామిడి పంటలో యాజమాన్య పద్ధతులు, ఎగుమతి అవకాశాలపై నల్లమాడలోని ఏపీ మాస్ కలెక్షన్ సెంటర్‌లో శుక్రవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా ఉద్యానాధికారి చంద్రశేఖర్, ఏరువాక కేంద్రం అధికారి రామసుబ్బయ్య, హెచ్‌ఓ నవీన్‌కుమార్, ఏఓ శంకర్‌నాయక్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. బెంగళూరుకు చెందిన అగ్రి పార్క్ ఇన్నోవా బయో లిమిటెడ్ ప్రతినిధులు ఎగుమతికి అవసరమైన నాణ్యతా ప్రమాణాలను తెలిపారు. రైతు సంఘం సీఈఓ నరసింహ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఆయా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ కోరారు. ఈమేరకు శుక్రవారం డీవైఈఓ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల వద్ద అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కనగానపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, బడ్జెట్ కేటాయింపులపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతలకు ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి రాయితీ, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శులు ప్రసాద్, ఓబుళపతి పాల్గొన్నారు.

ఎన్పీకుంట: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూ మార్చి 3న తహసీల్దార్ కార్యాలయాల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, నాగిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పుట్టపర్తి టౌన్: పట్టణంలో బ్రిడ్జి సర్కిల్ వద్ద ఆర్‌వీజే ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అర్బన్ సీఐ సునీత ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో అధ్యక్షులు రామాంజనేయులు, షామీర్, కార్మికులు మూర్తి, జావిద్, జ్యోతి, సాయిరాం, అజయ్, వినోద్, వెంకి, షబ్బీర్, బాబా, సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

తనకల్లు: రాకుంటపల్లికి చెందిన ఆదెప్ప, కిష్టప్పపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి శుక్రవారం తెలిపారు. వివరాలు...గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ భార్య వెంకటలక్ష్మీదేవమ్మ తన గొర్రెలను మేత కోసం తీసుకెళ్లింది. అయితే ఆ గొర్రెలు అదెప్ప, కిష్టప్ప సాగు చేసిన టమాట పంటను మేశాయి. దీంతో వారు ఆమె కులం పేరుతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నాటుసారాతో అనర్థాలు

కనగానపల్లి: ఆరోగ్యానికి హానికరమైన నాటు సారాకు ప్రజలు దూరంగా ఉండాలని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ సీఐ ఎం.ఫరూక్ తెలిపారు. మండలంలోని వేపకుంట గ్రామంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంపై ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిషేధించిన నాటుసారా అనర్థాలపై ర్యాలీ, సమావేశాల రూపంలో ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కదిరి అర్బన్: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ జూనియర్ కళాశాల, కుమ్మరవాండ్లపల్లిలోని స్పేస్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర్ తెలిపారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని తెలిపారు. మొత్తం నాలుగు సెంటర్లలో 2000 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.

స్టోర్ డీలర్‌పై వ్యక్తి దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతినగర్‌లో స్టోర్ డీలర్‌పై ఓ వ్యక్తి దాడి చేశబూడు. టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు పట్టణంలోని మారుతినగర్‌లో స్టోర్ నడుపుకుంటున్న మోపూరి దామోదర్‌నాయుడును రాజేంద్రనగర్‌కు చెందిన మల్లేష్ యాదవ్ స్టోర్‌ను వదిలిపెట్టాలని బెదిరించడంతోపాటు శుక్రవారం స్టోర్ డీలర్ ఇంటిలోకి దూరి అతనిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కదిరి అర్బన్: కే. బత్తలపల్లి తాండా వద్దపై శుక్రవారం రాత్రి రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కే. బత్తలపల్లితండాకు చెందిన భాస్కర్‌నాయక్ కదిరి నుంచి సూపర్‌ఎక్సెల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన మహేష్‌నాయక్ తండానుంచి కదిరికి వెళ్తుండగా అన్నమాచార్య స్కూల్ వద్ద రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భాస్కర్‌నాయక్ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తీసుకెళ్లారు.

కంది వామి దగ్ధం

ఓడీచెరువు: మండల కేంద్రంలోని ఈద్గా మైదానం సమీపంలో అగ్నిప్రమాదంలో కంది వామి దగ్ధమైంది. రైతు అబ్దుల్ హుస్సేన్ కంది, ఉలవపొట్టును ఈద్గా మైదానం సమీపంలో వామిగా వేశాడు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయింది. ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వాహనాల వేలం

పుట్టపర్తి టౌన్: స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌లో శుక్రవారం వివిధ కేసుల్లో పట్టుబడిన 3 బైకులు, ఒక కారును వేలం వేశారు. వేలం ద్వారా వచ్చిన రూ.75,500ను ఖజానాకు జమ చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ తెలిపారు.

క్లుప్తంగా

హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోండి


ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: బీసీ హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పీఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌పీ, ఎస్‌ఎస్‌యూఐ నాయకులు ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి డివిజన్ బీసీ హాస్టల్‌లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదన్నారు. వార్డెన్లు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. ఒక వార్డెన్‌కు రెండు మూడు హాస్టళ్ల బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ కరువవుతోందని చెప్పారు. బయోమెట్రిక్ పని చేయడం లేదని చెప్పి మాన్యువల్ పద్ధతిలో విద్యార్థుల అటెండెన్స్ వేసి బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో రాత్రి మిగిలిపోయిన భోజనాన్ని పొద్దున్నే విద్యార్థులకు ఇస్తున్నారన్నారు. ఇంతజరుగుతున్నా ఏబీసీడబ్ల్యూలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నాయకులు అరుణ్, నరసింహా, ఉపేంద్ర, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న ఎంఈఓ

నల్లమాడ: మండల కేంద్రంలోని ప్రాథమిక, భవిత కేంద్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆస్ట్రేలియాకు చెందిన సత్యసాయి భక్తుల సహకారంతో పుట్టపర్తికి చెందిన షామీర్ శుక్రవారం చీర, దోవతితో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. షామీర్ మాట్లాడుతూ బాబా స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే భక్తి, సేవను అలవర్చుకోవాలన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్న సత్యసాయి సూక్తిని అనుసరిస్తున్న ఆస్ట్రేలియా భక్తులను ఎంఈఓ వేమనారాయణ అభినందించారు. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్యాంప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మేనమామపై అల్లుడు, స్నేహితుల దాడి

ధర్మవరం అర్బన్: మేనమామపై అల్లుడు, అతని స్నేహితులు దాడి చేశారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు..గుడ్స్‌షెడ్‌కొట్టాలకు చెందిన గూడూరు మారుతి శుక్రవారం లక్ష్మీనగర్‌లోనున్న తన చెల్లెలు అరుణ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో చెల్లెలు అరుణను ఆమె కుమారుడు నందవర్ధన్ కొడుతుండటంతో దండించాడు. వెంటనే బయటకు వెళ్లిన నందవర్ధన్ తన స్నేహితులు నలుగురిని పిలుచుకుని వచ్చి మేనమామపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టాలపై అవగాహన

కదిరి అర్బన్: బూరుగుపల్లిలోని ఆర్డీటీ స్కూల్‌లో శుక్రవారం అధికారులు పౌర హక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఏఈ గుప్తా, ఏపీఓ హరున్‌రషీద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: కుటాగుళ్లలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తారక రామారావునగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆదెప్ప అదే గ్రామానికి చెందిన హరిప్రసాద్ వద్ద ఆదెప్ప కొన్నేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో పదేళ్ల క్రితం సొంత అవసరాల కోసం రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆదెప్పకు వచ్చే కూలి డబ్బు అప్పుడప్పుడూ జమ చేసుకున్నాడు. ఇంకా రూ.1.14 లక్షలు చెల్లించాలంటూ హరిప్రసాద్ ఆదెప్పతో ఇటీవల గొడవకు దిగాడు. దీంతో అవమానంగా భావించిన ఆదెప్ప శుక్రవారం విషద్రావకం తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. బాధితుడి భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నల్లచెరువు: నడిపల్లిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యాయుడు(వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి) ఇంద్రప్రసాద్‌కు శుక్రవారం ఎమ్మార్సీలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఎంఈఓలు తిరుపాల్‌నాయక్, చెన్నకేశవులు ఉపాధ్యాయులతో కలిసి ఇంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు.